మార్తాండతేజుడు ప్రతిపక్షపు నాయకుడిలా మండిపడుతున్నాడు. "అబ్బబ్బ ఏం ఎండలు? చెమటలు ధారాపాతంగా కారిపోతున్నాయ్. అసలు ఈ మధ్యాహ్నపు స్కూళ్ళు



వాలి హిరణ్మయీదేవి

ఏమాశించిపెడతారో అర్థంకాదు. టీచర్లు స్కూల్ నుంచి వాళ్ళ ఇళ్ళకు వెళ్ళాలంటే ఎర్రటిఎండలో షెల్టరుండీ లేనట్లుండే బస్టాపులలో పడిగాపులు గాయాలి. ఇక ఈ పిల్లలు ఎర్రబడిపోయిన మొహాలతో – ఎండలో ఇంటికి చేరాలి. ఇదుగో మనలాంటివాళ్ళం ఈ పిల్లల్నితీసుకు రావడానికిలా వగరుస్తూ రావాలి. కాస్తతినగానే చక్కగా నిద్రవస్తుంది – ఇలా కనురెప్ప పడీపడగానే మా కోడలు 'మామయ్యగారూ – పిల్లల్ని స్కూల్ నుంచి తీసుకురండి' అంటూ మొదలెడుతుంది. దాంతో నిద్రకు బైబై చెప్పి ఈ ఎండలో రావలసివస్తుంది" అన్నాడు మోహనరావ్, తనతో పాటూ అదే పని మీద వస్తోన్న రాఘవరావ్‌తో.

"అవును నిజమే. కనీసం లెసన్స్ చెప్పకపోయినా మధ్యాహ్నంనుంచి నాలుగింటివరకూ స్కూల్‌లోనే ఉంచితే పిల్లలకూ టీచర్లకూ – మనలాంటి ముసలివాళ్ళకూ ఎంతసుఖంగా ఉంటుంది." వంతపలుకుతూ అన్నాడు రాఘవరావ్ చెమటనద్దుకొంటూ. తమతోపాటు వచ్చిన మున్ని – చిన్నిలను వారింట్లో వదిలి, తమ ఇంటి సందువైపు తన మనవలతో కదిలాడు మోహనరావ్.

గుమ్మంలో అడుగుపెట్టాక కళ్ళుబైర్లు కమ్మినట్లై ఏమీ కన్పించలేదు. వెళ్ళి, చల్లటినీళ్ళతో ముఖం కడుక్కొని ఈజీఛైర్‌లో వాలాడతను. తన మనవల్ని తీసుకొని డైరెక్ట్‌గా ఇంటికొచ్చేస్తే, అరగంటలో రాగలడు. కానీ తమకు తెలిసిన వారి పిల్లల్ని కూడా, వారి పెద్దల రిక్వెస్ట్ మేరా తీసుకొచ్చి, వారిని వారి వారి ఇళ్ళలో వదిలి రావలసి రావడంతో మరోఅరగంట 'ఎండదెబ్బ' రుచి చూడాల్సివస్తోంది. మొహమాటంతో ఆ పని మీద వేసుకోవడంతో వచ్చినచిక్కు ఇది. కోరి మీద వేసుకొన్నందుకు అనుభవించక తప్పదు. ఇక ఈ స్కూళ్ళకి సెలవులిచ్చేంత వరకూ తప్పదు – ఎవరే హెల్ప్ అడిగినా కాదనలేక ఆ పనులన్నీ మీద వేసుకోవడం, బాధపడడం. ఈ మొహమాటం ఇంకా ఎంత కాలం ఇలా తనని వదలకుండా వెన్నంటి ఉంటూ తననిలా చంపుతుందో అనుకొన్నాడు. మొహమాటపు మోహనరావ్‌గా పేరుపడ్డ అతనికి – అది తెచ్చిన తిప్పలన్నీ తనబాల్యం నుంచీ ఒక్కటొక్కటే గుర్తుకు రాసాగాయి.

"ఒరేయ్! రాజూ, నాకివాళ కడుపునొప్పిగా ఉందిరా – ప్లీజ్! ఇవాళైనా నీ బ్యాగ్ నువ్వే పట్టుకోరా" దీనంగా అడిగాడు పదేళ్ళ మోహన్.

"ఏంట్రా అలా అంటున్నావు. అంత లావుగా ఉన్నావ్. నా బ్యాగ్ మోయలేవూ? అక్కడికీ నీ వాటర్ బ్యాగ్ పట్టుకొంటున్నా గదా" అన్నాడు ధాటీగా రాజు – వాడికేడేళ్ళే అయినా, అర్భకంగాఉన్నా పనులు జరిపించుకోవడంలో దిట్ట.

మోహన్ ఉస్సురనుకుంటూ నోర్మూసుకు


# మొహమాటపు మోహనరావ్

న్నాడు. బొద్దుగాఉన్న మోహన్‌కి తన ఒళ్ళు తను మోసుకోవడమే కష్టం. కానీ అది గ్రహించకుండా 'మా పిల్లవాడు 'చిన్న పిల్లాడు' వాడిని కాస్త కనిపెట్టుకొని ఉంటూండు మోహన్! నీకే తమ్ముడుంటే వాడి బ్యాగ్ పట్టుకొనేవాడివిగా - వీడి బ్యాగ్ నువ్వేపట్టుకోమ్మా - అంతగా అయితే నీ వాటర్‌బ్యాగ్ వాడికివ్వు - పాపం వాడు పట్టుకొంటాడ్లే' అంటూ పక్కింటి ఆంటీ తన కొడుకు బాధ్యత అప్పజెప్పింది. మొహమాటంతో ఆ నిముషంలో తలాడించిన ఫలితంగా, రెండేళ్ళుగా వాడి బ్యాగ్ మోస్తున్నాడు. ఇంకెంత కాలమో ఇలా మోయడం అనుకొంటూ బాధపడటమే తప్ప ఎలా తప్పించుకోవాలో ఆలోచించలేని బుర్ర మోహన్‌ది. క్లాస్‌లోనూ అంతే - అందరూ ఎంతో స్వతంత్రంగా తన పెన్సిల్ రబ్బర్ తీసుకొని వాడేస్తే ఏమీ అనలేకపోయేవాడు. కొందరు అల్లరిపిల్లలు తన టిఫిన్‌బాక్స్‌ని అడిగి ఏమీమిగల్చకుండా సుష్టుగాతిని ఇచ్చేవాళ్ళు. ఆకలి వేస్తున్నా మొహమాటం కొద్దీ వాళ్ళని తినొద్దని చెప్పలేకపోయేవాడు. ఖాళీ కడుపుతో ఇంటికొచ్చి తల్లితో ముందుగా చీవాట్లు తిని, ఆనక అన్నంతిన్న సందర్భాలెన్నో. అలాగే మరో సంఘటన గుర్తుకొచ్చిందతనికి - అది ఇంటికెళ్ళి అన్నంతిని హోమ్‌వర్క్ చేసుకొందామని బయలుదేరాడు మోహన్. ఇంతలో ఎదురింటి రాణీ పిలిచింది "మోహన్!, ఒరేయ్ మోహన్! ఇలా రారా - త్వరగా రావాలి" అంటూ.

వద్దు వద్దనుకొంటూనే మొహమాటం కొద్దీ వెళ్ళాడు. "మోహన్! కాస్త మార్కెట్‌కి వెళ్ళి అల్లం, పచ్చిమిరపకాయలూ పట్రా - అలాగే కరివేపాకు కూడా మరిచిపోకుండా తేవాలి - ఏది మరిచిపోయినా మళ్ళీ వెళ్ళాల్సివస్తుంది సుమా. తొందరగా తీసుకొనిరా - ఇంటికి చుట్టాలొచ్చారు - వెళ్ళు" అని కంగారుపెట్టేస్తూ డబ్బులూ సంచి మోహన్ చేతికందించింది. ఆ అమ్మాయ్ ప్రత్యేకత ఏంటంటే ఎదుటివారికి మాట్లాడే అవకాశం, ఆలోచించే టైమ్ ఇవ్వకపోవడం. అలా చెప్పినపని చేయకుంటే 'నీకే నష్టం'అన్న లెవల్లో చెబుతుంది.

యధాప్రకారం మోహన్ పిచ్చిమొహమేసుకొని, ఆఘమేఘాల మీద వెళ్ళి ఆమె చెప్పినపని చేసుకొచ్చాడు. వగరుస్తూ అనుకొన్నాడు 'మళ్ళీ ఇంకోసారి వెళ్ళనే వెళ్ళను' తనింత పరుగుపరుగున వెళ్ళి తెస్తే "అల్లం అలాంటిది తెచ్చావేం - కరేపాకూ ఎండిపోయింది" అంది, థాంక్స్ చెప్పకబోగా. వెళ్ళిన ప్రతీసారీ - ఇదే చివరిసారి అనుకొంటూ వెళ్ళడం పైనుంచి మాటలు పడడం - ఛ అనుకొన్నాడు మోహన్. అతని కళ్ళకి కుక్కతోకని సరిచేస్తున్న ఎదురింటి పిల్లాడు కన్పించి నవ్వొచ్చింది. తనూ అంతేగా అనుకోగానే బాధ కలిగింది. నిన్నటికి నిన్న తన పక్కన కూర్చున్న రఘు - పక్కపిల్లాడి పేపర్లు చింపితే - వాడు దాన్ని తనమీద తోయడం - కాదనడానికి మొహమాటం అడ్డొచ్చి టీచర్‌తో తన్నులు తినడం తనవంతే అయింది. ఇలా ఎన్నోసార్లు తను చేయని తప్పులకు పనిష్మెంట్ అనుభవించాడు - అయినా ధైర్యంగా నోరువిప్పకుండా అడ్డొస్తుందీ దరిద్రపు మొహమాటం.

ఇంట్లోనూ అంతే - "చెల్లెళ్ళిద్దరూ ఆడపిల్లలు - మగపిల్లాడివి - నువ్వే పాలకి వెళ్ళాలి - మార్కెట్‌కి వెళ్ళాలి" అంటుంటే తల్లిదగ్గరా అదే మొహమాటం. దానికితోడు చెల్లెళ్ళ మీద ప్రేమా తోడయి ఆ పనులు అతని పాలబడ్డాయి. ఏళ్ళు గడుస్తున్నకొద్దీ మొహమాటపు 'గాఢత' ఎక్కువ కాసాగిందే తప్ప 'పలుచ' బడడం లేదతని విషయంలో. ఆ తర్వాత యుక్త




వయసుకొచ్చాక జరిగినవి గుర్తుకు రాసాగాయి మోహనరావ్‌కి.

* * *

షేవింగ్ చేసుకొనే వంకతో డాబా మీదకెళ్లాడు మోహనరావ్. ఒళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురింటి కిటికీవైపు చూడసాగాడు. ఓగంట నిరీక్షణ తర్వాత మెరుపులా మెరిసి మాయమైంది విద్యుల్లత. 'ఛ – ఈ పిల్లకీపేరు తప్ప మరేపేరు పెట్టినా బావుండేది – తన పేరును సార్థకం చేసుకొంటుందాన్నట్లు మెరుపులా మెరిసి మాయమవుతుందే తప్ప తను తనివితీరా చూసేలా నిలబడడం లేదు' అని విసుక్కోవడం మోహన్ వంతవుతోంది. 'ఛ – ఈ చూపులతో లాభం లేదు. మనసువిప్పి చెప్పాలి లెటర్ ద్వారా' అనుకొని లెటర్ రాయడానికి కూర్చున్నాడు మోహన్. బుర్రంతా బ్లాంక్‌గా తయారైంది. పదిసార్లు జుట్టు పీక్కొంటే ఒక్కలైన్ రాయడం కుదిరింది – ఆరులైన్ల ఉత్తరానికి అరవైసార్లలా జుట్టు పీక్కున్నాడు. మర్నాడు ఆ అమ్మాయికా లెటర్ ఇవ్వాలని గుమ్మంలో తచ్చాట్లాడుతోంటే చిత్రంగా ఆ అమ్మాయే మోహన్‌ని పిలిచింది. తబ్బిబ్బవుతూ వెళ్ళాడు మోహన్.

"నువ్వే షాంపు వాడతావు మోహన్" అంటూ అడిగింది.

"ఏం – ఎందుకు" అంటూ 'ఆల్‌క్లియర్ అనుకొంటా' అన్నాడు తడబడుతూ.

"ఏమీ లేదు. ఆ షాంపుని వాడకుండా ఉండాలని అడిగాను, ఒకవేళ మా ఇంట్లో పొరపాట్న ఆ షాంపూతెస్తే నీలా రాత్రికిరాత్రే అరగుండుతో మిగలాల్సివస్తుందని" అంటూ కిసుక్కుననవ్వి వెళ్ళిపోయింది – ఉధృతంగా వచ్చే నవ్వుని ఆపుకొనే ప్రయత్నంలో పరుగులు తీస్తూ.

ఎర్రబడ్డ మొహంతో వెర్రిచూపులతో నిలబడిపోవడం మోహన్‌వంతైంది. 'ఎంతో కళాత్మకంగా తమ తొలిపరిచయం, తొలి మాటలు

ఉండాలని ఆశిస్తే ఇలా జరిగిందేమిటి?' అనుకొంటూ జుట్టు పీక్కోబోయి అలాచేస్తే ఇక ఈసారి పూర్తి గుండయ్యే ప్రమాదం ఉందని తనచేతుల్ని గోడకేసి కొట్టుకొన్నాడు. ఆ పిల్ల కన్పించినపుడల్లా ఆనవ్వే కన్పించి - మాటలు పెగిలేవి కాదతనికి.

రోజులు చకచకా గడుస్తున్నాయ్.

"మోహన్! - ఒరేయ్ మోహన్! నువ్వో చిన్నపని చేయాల్రా! చచ్చి నీ కడుపున పుడతాన్రా" అంటూ వచ్చాడు చిన్ననాటి ఫ్రెండయిన శేఖర్.

"ఏంటో చెప్పరా - నీకు తెలీదా? నీకోసం నా ప్రాణాలన్నా ఇస్తాన్రా" అన్నాడు వీరావేశంగా మోహన్.

"వెధవ ప్రాణాలెవడికి కావాలి గానీ - మీ ఇంటి ఎదురుగా ఉండే విద్యుల్లతని నాకు పరిచయం చేయాల్రా" అన్నాడు శేఖర్.

నీళ్ళు తాగుతున్న మోహన్‌కి ఒక్కసారిగా పొలమారింది.

"...న్నేన్నేనా" అన్నాడు నత్తినత్తిగా.

"ఇదేంట్రోయ్ - ఇప్పుడే అకస్మాత్తుగా అలా నత్తొచ్చింది. ఆ పిల్లనోసారి పిలవరా - నేనే పరిచయం చేసుకొంటాగానీ" అన్నాడు శేఖర్.

"అమ్మో - నేనెళ్ళి పిలవడమా?" భయంగా అన్నాడు మోహన్.

"ఓరి దౌర్భాగ్యుడా? ఇప్పుడే గదరా నా కోసం ప్రాణమిమ్మన్నా ఇస్తానని కూశావ్?"

"...న్నిన్నిన్నిజమే అనుకో" గానీ...

"ఏంట్రా నీకీ నత్తెప్పుడు వచ్చింది?" చిరాగ్గా అడిగాడు శేఖర్.

ఏమీ మాట్లాడలేదు మోహన్.

"ఒరేయ్! ఆ పిల్లను చూసింది మొదలు నిద్రపట్టడం లేదురా - ఆ పిల్ల లేని జీవితం శూన్యంగా తోస్తోందిరా. మీ ఎదురింటి పిల్లేగా - ఎలాగోలా మాట్లాడి - మా ఇద్దర్నీ ఒక్కటి చేయరా" అన్నాడు శేఖర్ దీనంగా. దాంతో కరిగిపోయాడు. తనూ ఆమెనిష్టపడుతున్నానని చెప్పడానికి ఎప్పట్లాగే మొహమాటం అడ్డొచ్చింది. ఫ్రెండ్‌కోసం తెచ్చుకొన్న ధైర్యం - వారిద్దరినొకటిగా చేసేందుకు పనికొచ్చింది. బాధనంతా మనసులోనే అణచుకొని - శేఖర్ పెళ్ళి దగ్గరుండి జరిపించాడు.

* * *

"ఏమంటావురా! పిల్ల చక్కగా దబ్బపండులా ఉంది. నాకీ సంబంధం అన్ని విధాలా నచ్చింది - ఏమంటావ్" మరోమారు రెట్టించింది శకుంతలమ్మ. పిల్లలాగే - పిల్ల తేబోయే కట్నకానుకలు 'భారీ'గా ఉండడంతో.

"మాకు ఆడబడుచు కట్నాలు చెరో అర లక్షా ఇస్తామన్నారు - ఒప్పేసుకో అన్నయ్యా" అంటూ గడ్డంపట్టుకొని బతిమాలారు మోహన్‌ని, అతని చెల్లెళ్ళు. వాళ్ళింటికెళ్ళి శుభ్రంగా మేసేసి - ఇందరికి నచ్చిన ఆ గజలక్ష్మిని కాదనడానికి మొహమాటం అడ్డొచ్చి ఒప్పేసుకొన్నాడు మోహన్. దాంతో పెళ్ళున పెళ్ళయిపోయిందతనికి.

"ఏమండీ! మీకు మీద కాళ్ళేస్తే నిద్ర పడుతుందా" అడిగింది తొలిరాత్రి గజలక్ష్మి ముద్దు ముద్దుగా - ఆమె పర్సనాలిటీని చూస్తూ, 'మర్నాటికి ఊపిరుంటేగా - నిద్రపోయేది' అని మనసులో అనుకొంటూనే అవునూ - కాదుల మధ్యగా తలూపాడు మోహన్. అంతే అతనిమీద కాళ్ళుపడేసి నిశ్చింతగా నిద్రలోకి జారుకొంది

గజలక్ష్మి. అలా మొహమాటంతో మొదటిరోజే అమెమాట వినడానికి అలవాటు పడిపోయాడతను.

"ఏమండీ, మా తమ్ముడు బ్యాంక్‌లోన్ తీస్కొని ఏదో ఫాక్టరీ పెడతాడట - ఏవో షూరిటీ సైన్‌లు కావాలట - పెట్టేయండి" అంటూ పేపర్స్ అందించింది గజలక్ష్మి.

"మా ఫ్రెండ్ అడిగినప్పుడు సంతకం చేస్తే 'మీ దరిద్రపు మొహమాటం నాశనంగానూ అలా సైన్ చేస్తారా?' అంటూ తిట్టావుగా. ఇంకెప్పుడూ షూరిటీలు ఇవ్వొద్దని ఒట్టేయించుకొన్నావ్‌గా - మరెలా పెట్టను?" అడిగాడు సంశయంగా మోహన్.

"మీ మొహం మండా. పెళ్ళికి - చావుకీ ఒకటే మంత్రమా" అందామె పళ్ళునూరుతూ. దాంతో ఎన్నోసార్లు నష్టాలనుభవించిన మోహన్, భయం భయంగా సైన్‌లు చేశాడు.

"ఏవండీసాయంత్రం మా ఫ్రెండింట్లో ఫంక్షనుంది వెళ్ళాలి. నాలుగ్గంటలకల్లా వచ్చేయండి" అంది ఆర్డరేస్తూ గజలక్ష్మి.


"సరే"నన్నాడు మోహన్. అతని ప్రమేయం లేకుండానే తల ఆడింది. తొందరతొందరగా తనపని ముగించుకొని, బాస్ రూమ్‌లోకి వెళ్ళబోతున్న మోహన్ దగ్గరకు వచ్చింది రమ్య నవ్వుతూ. అంతే మనసులో గుబులు మొదలయింది. ఆమె నవ్వుతూ వచ్చిందంటే డెఫెనైట్‌గా తనకేదో పని రుద్దడానికే అన్నది అనుభవం కాబట్టి.

"మోహన్! మాపాపని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి - కొంచెం ఈ ఫైల్ విషయం చూడండి - ప్లీజ్" అంటూ మోహన్ అంగీకారం కోసం చూడకుండా - ఆఫైల్‌నతని చేతిలో పెట్టేసి వయ్యారంగా వెళ్ళిపోయిందామె - మొహమాటంకొద్దీ కాదన్లేకపోయిన మోహనరావ్ - ఆ తర్వాత ఇంటిదగ్గర భార్య విప్పిన 'బూతు పురాణానికి' బలయిపోయాడు.

* * *

మోహనరావ్ రిటైర్ అయిన ఆరునెల్లకే ఆక్సిడెంట్‌లో పోయింది గజలక్ష్మి. ఆమె తిట్లకు అలవాటుపడ్డ మోహన్‌రావ్‌కి అవిలేక చాలా వెలితిగా ఫీలయ్యాడు. తమదగ్గర ఉండమంటే తమదగ్గర ఉండమని ముగ్గురుకొడుకులు బలవంతం చేస్తే - ఆ విషయంచెప్పి శేఖర్ సలహా అడిగాడు మోహన్‌రావు తన మొహమాటంతో తేల్చుకోలేక.

"ఇన్నాళ్ళూ - నీ భార్యతో చాలా వేగి 'ఫుల్ ఫ్రై' అయిపోయావ్. ఇప్పుడైనా ఎంచక్కా లైఫ్‌ని ఎంజాయ్‌చెయ్ - నీ వయసేం ముదిరిపోలేదు, నువ్వేం ముసలాడివైపోలేదు" అన్నాడు శేఖర్.

WANTED AREA WISE DEALERS
An ISO 9001 Company Products
BlowHOt™
★ BUILT-IN GAS HOBS
★ KITCHEN CHIMNEYS
Enjoy Freshness in Kitchen Everyday

Authorised Distributors for Andhra Pradesh
VANGUARD HOME APPLIANCES
Tarbund, SECUNDERABAD.
© 93913 23794, 99497 39339
www.vanguardhomeappliances.info
WANTED (M/F) EXECUTIVES / MANAGERS

కానీ యథాప్రకారం - మొహమాటంకొద్దీ కొడుకుల్ని నొప్పించలేక తలోచోట ఆర్నెల్లుం డేట్లు ఒప్పందానికొచ్చాడు మోహన్‌రావ్. మావ గారి మెతకదనం ముఖ్యంగా అతని మొహమా టాన్ని అలుసుగా చేసుకొని కోడళ్ళు ఒక్కోపని రుద్దడంతో శక్తిలేకున్నా ఆ పనులు చేయడంలో 'బిజీ' అయిపోయాడిలా.

కోడళ్ళకి తమ కుటుంబం కన్నా - పిల్లల కన్నా టీవీల్లో వచ్చే ఆ జీడిపాకం సీరియల్సే ఎక్కువ - వాటిని మిస్‌కాకుండా ఉండేందుకే మావగారికి, స్కూళ్ళ నుంచి పిల్లల్ని తీసుకొచ్చే పని అప్పజెప్పేశారు. ఇలా స్కూల్స్‌కి - బజారు పనులకి తిరగవలసి రావడం అతని దినచర్య యింది. ప్రాణం విసిగినపుడు మాత్రం 'ఛ - శేఖర్ చెప్పినట్లు చేసి ఉంటే బావుండేది' అను కోవడం, నిట్టూర్పులు వదలడం మోహనరావ్‌కి మామూలయింది. కోడలి పిలుపుతో అతను తన గతస్మృతులనుంచి బైటకు వచ్చాడు.

*　*　*

ఆ సాయంకాలం పిల్లల్ని ఎప్పట్లా పార్క్‌కి తీసుకువచ్చాడు మోహనరావ్. అక్కడేదో చిన్న సభ జరుగుతుండడం, చప్పట్లు భారీగా విన్పిం చడం గమనించి, పిల్లలను ఓ పక్కగా ఆడుకో మని చెప్పి, అక్కడే ఉన్న మరోవ్యక్తికి 'కాస్త పిల్లలను గమనించండని' రిక్వెస్ట్ చేసి, అక్కడ వేసిఉన్న కుర్చీలో కూర్చుని ఆ స్పీచ్‌ని వినసా గాడు. స్పీచ్ ఇస్తున్న వ్యక్తిని ఎక్కడో చూసినట్లు, ఆ గొంతు ఎక్కడో విన్నట్లు అన్పించి, ఆరాగా చూసాడు. "క్లాస్‌లో వెనుక బెంచీలో కూర్చొని, అల్లరిచేస్తూ టీచర్లతో తన్నులుతినే వెంకటేశం గా అతణ్ణి గుర్తించేసరికి, ఎక్కడ్లేని ఆశ్చర్యం కల్గింది. ఒకప్పుడు తనూ, తన కాలేజ్ డేస్‌లో కవితలూ -కథలూ రాసి మెప్పుపొందాడు. డ్రా మాల్లో నటించి మెప్పించాడెందరినో. ఎంతో వృద్ధిలోకివస్తావని నల్గురుతో అన్పించుకొన్న తను, ఇప్పుడిలా అనామకంగా మిగిలిపో యాడు.

'ఎందుకూ కొరగావురా అన్పించుకొన్న వెంకటేశం ఇలా పేరు ప్రఖ్యాతులతో వెలిగిపో తున్నాడు. లోపం తరచిచూస్తే తనలోనే ఉంది. ఇందాక వాడు తన స్పీచ్‌లో ఏమన్నాడు? మని షన్నాక వాడి జీవితానికి ఒక సార్థకత ఉండాలి. కాస్తంత కళాపోషణ చేయాలి. లేకుంటే ఇక మనిషికి - జంతువుకి తేడా ఏముంది' అని గదూ. ఇల్లుచేరాక కూడా ఒకటే ఆలోచన, కళలపట్ల ఎంతో మక్కువున్న తను, ఇప్పుడింత యాంత్రికంగా ఎలా మారిపోయాడు? ఏ బాద రబందీ లేకున్నా, ఒకరిమీద ఆధారపడవలసిన అవసరం లేకున్నా - ఎందుకిలా స్థబ్దంగా మా రాడు. 'తనకోసమే బతికేకన్నా - పరులకి చేత నైనంత మేలుచేస్తే కదా జీవితానికో సార్థకత ఏర్పడేది' అన్న ఆలోచన వటుడింతై, అంతై నట్లుగా పెరిగిపోయింది. ఎలాగూ పల్లెటూళ్ళో తన ఇల్లు దీపంపెట్టే దిక్కు లేకుండా ఉంది. దాన్ని రిపేర్ చేయించి, తనక్కడికి షిఫ్ట్ అయి పోయి, తిరిగి రచనావ్యాసంగానికి శ్రీకారం చుట్టాలి. తను నేర్చుకొన్న హోమియోపతి వైద్యా న్ని తన ఊరివారికి అందించాలి. ఓ నాటక సమాజం ఏర్పాటుచేసి, మరుగున పడుతున్న నాటకరంగానికి వీలైనంత సేవచేయాలి. దీం తో తన చరమజీవితం ఉత్సాహభరితంగా ఉం టుంది అని ఖచ్చితంగా నిర్ణయించుకొని, ఈసారి మొహమాటాన్ని దగ్గరికి రానీయకుం డా కొడుకులకి తన నిర్ణయం చెప్పి తనఊరికి బయలుదేరాడతను. అతను తన పనులలో సఫ లీకృతుడు కావాలని ఆకాంక్షిద్దాము. ●